క్లుప్తంగా

ప్రత్యేక శ్రద్ధతో బోధించాలి

• డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్, హెచ్‌ఎం లక్ష్మీప్రసన్న

పరవాడ: పదో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపర్చడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని యలమంచిలి ఉప విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ సూచించారు. ధర్మారాయుడుపేట జిల్లా పరిషత్ పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. తొలుత మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలించారు. రోజు వారీ మెనూను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వంటకాల విషయంలో ఎలాంటి లోటుపాట్లు వచ్చినా సహించబోమని మెనూ ప్రకారం తయారు చేయాలని సూచించారు. అనంతరం చదువుపై శ్రద్ధ చూపించి మంచి ఉత్తీర్ణత శాతం నమోదు చేయాలని విద్యార్థులకు డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్ సూచించారు.హెచ్‌ఎం లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

చెరువులో ఆక్రమణలు తొలగించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ దాడి లావణ్య తదితరులు

సబ్బవరం: మండలంలోని బంగారమ్మపాలెం సోమునాయుడు చెరువులో ఆక్రమణలు తొలగించి హద్దులు గుర్తించాలని సోమవారం తహసీల్దార్ సత్యనారాయణకు సర్పంచ్ దాడి లావణ్య ఫిర్యాదు చేశారు. బంగారమ్మపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 49,52లలో ఈ సాగునీటి చెరువు విస్తరించి ఉందన్నారు. కొంత కాలంగా ఈ చెరువు ఆక్రమణలకు గురవుతుందన్నారు. చెరువులోని ఆక్రమణలను తొలగించి హద్దులు నిర్ధారించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. సర్పంచ్‌తో పాటు దాడి కన్నంనాయుడు తదితరులు ఉన్నారు.

గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్న పొక్లెయిన్, ట్రాక్టర్ స్వాధీనం



ఆరిపాక శివారులో పట్టుబడిన పొక్లెయిన్, ట్రాక్టర్

సబ్బవరం: మండలంలోని ఆరిపాక శివారులోని వెంకటరావు చెరువులో గ్రావెల్,మట్టి అక్రమంగా తరలిస్తున్న పొక్లెయిన్,ట్రాక్టర్ సీజ్ చేసినట్లు సీఐ రంగనాథం సోమవారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బంది ఆదివారం రాత్రి దాడి చేసి గ్రావెల్ తరలిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారన్నారు. వాహనాలపై కేసులు నమోదు చేసి తదుపరి చర్యలు తీసుకునేందుకు తహసీల్దార్‌తో పాటు మైనింగ్,ఇరిగేషన్ అధికారులకు అప్పగిస్తామన్నారు.

'ఇంటి నిర్మాణం ఆపాలి'

సబ్బవరం: మండలంలోని అమృతపురం శివారు చింతగట్ల జగనన్న కాలనీలో అక్రమంగా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాన్ని అడ్డుకోవాలని, అనర్హులకు ఇచ్చిన ఇంటి పట్టా వెంటనే రద్దు చేయాలని గ్రామానికి చెందిన కొంతమంది తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో వినతి పత్రం అందజేశారు. మూడు పక్కా ఇళ్లు ఉన్న వారికి మళ్లీ ఇల్లు మంజూరైందని ఇప్పటికే ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని ఇంటి పట్టా రద్దు చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసినవారిలో ఎ.సత్యం, బంగారునాయుడు, వి.అప్పారావు, ఎ.నరసింగరరావు తదితరులు ఉన్నారు.

ఐదుగురు పందెం రాయుళ్ల అరెస్ట్

సబ్బవరం: మండలంలోని మొగలిపురం శివారులో కోడిపందాలు నిర్వహిస్తున్న స్థావరాలపై సోమవారం సాయంత్రం దాడులు నిర్వహించి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ రంగనాథం తెలిపారు. వారి నుంచి మూడు పందెం కోళ్లతో పాటు రూ.2,150 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.వారిపై కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు సీఐ తెలిపారు.

ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలు



సమావేశానికి హాజరైన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు



గృహ సారథులకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

- ఆ బాధ్యత వలంటీర్లు, గృహసారథులదే
- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- 11 నుంచి 'మా నమ్మకం నువ్వే జగనన్న'

పరవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి గృహ సారథులు, వలంటీర్లు కృషి చేయాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. వెన్నలపాలెం కల్యాణ మండపంలో సోమవారం మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు అధ్యక్షతన జరిగిన మండల గృహసారథుల శిక్షణ శిబిరంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ నెల 11న ప్రారంభం కానున్న మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం ద్వారా వలంటీర్ల సహకారం తీసుకొని గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించాలన్నారు. గత ప్రభుత్వం మోసపర్చిన విధానం, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు తెలియజెప్పాలన్నారు. డోర్ స్టిక్కర్లు, మొబైల్ స్టిక్కర్లు అంటించే బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయాల్సిన బాధ్యత గృహసారథులు, సచివాలయ కన్వీనర్లపై ఉందన్నారు.

గెలుపే లక్ష్యం

రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని సూచించారు. ప్రజా సంకల్ప యాత్రలో ప్రజలకిచ్చిన హామీలను శతశాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు తెలియజేసి వారి మద్దతుతో వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ చెప్పారు. అనంతరం గృహ సారథులకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, వైస్ ఎంపీపీ బూస అప్పలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, ఆర్‌ఈసీఎస్ మాజీ చైర్మన్ చల్లా కనకారావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, లంకెలపాలెం పీఏసీఎస్ చైర్మన్ బురదరాజు, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, పెందుర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పైల అప్పలనాయుడు, ముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం, భర్నికం, పెదముషిడివాడ, సర్పంచ్‌లు చింతకాయల సుజాత ముత్యాలు, కూండ్రపు వరలక్ష్మిసీతారామయ్య, పెదిశెట్టి పూజాశేఖర్, పల్లా అప్పారావు, ముత్యాలమ్మపాలెం ఎంపీటీసీ అరిజిల్లి దేవిరవి, మడక సూరిబాబు, బండారు రామారావు తదితరులు పాల్గొన్నారు.

సీతారామాలయ వార్షికోత్సవాలకు
విస్తృత ఏర్పాట్లు

నేటి నుంచి 12 వరకు ఉత్సవాలు



సీతారాముల ఉత్సవమూర్తులు

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు పరిధి సింహపురి కాలనీలోని సీతారామాలయం 20వ వార్షికోత్సవాలను నేటి నుంచి ఈనెల 12వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈమేరకు విశేషంగా ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉదయం 9గంటలకు విష్వక్సేనపూజ, స్వామికి పంచామృతాభిషేకం జరుగుతుందన్నారు. సాయంత్రం 6.30గంటలకు 98వవార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పీతల అప్పలరాజు, పీతల విష్ణుమూర్తి ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం యాగశాల ప్రవేశ కార్యక్రమాలు ఉంటాయి.

➡ బుధవారం ఉదయం 9.30 గంటలకు ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజారోహణ, రాత్రి 7గంటల నుంచి సీతారాముల వార్షిక కల్యాణం నిర్వహిస్తారు.

➡ 9న ఉదయం 9.30 గంటలకు సంక్షిప్త రామాయణ సామూహిక పారాయణ, 10న ఉదయం 9.30గంటలకు మహాలక్ష్మీదేవికి కుంకుమార్చన, 11వతేదీ ఉదయం 9.30గంటలకు సుదర్శన హోమం, సాయంత్రం 5గంటలకు సీతారాముల గ్రామ తిరువీధి మహోత్సవం ఉంటాయని తెలిపారు.

➡ 12వ తేదీ ఉదయం 9.30 గంటలకు ధ్వజావరోహణ, గరుడ ప్రసాద వితరణ, ఉదయం 10 గంటలకు స్వామివారికి స్నపనం, చక్రస్నానం, పూర్ణాహుతి, తీర్థగోష్టి, యజ్ఞప్రసాద వితరణ, మధ్యాహ్నం 3గంటల నుంచి తీర్థమహోత్సవం(పరస) ఉంటాయి. సాయంత్రం 6గంటలకు శ్రీపుష్పయాగం, ఊంజల్‌సేవ, రాత్రి 8గంటలకు రుత్విక్ సన్మానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులంతా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఉత్సవ కమిటీలు సభ్యులు కోరారు.

అలాగే ఈనెల 13 నుంచి 19వతేదీ వరకు సీతారామాలయ ఉపాలయాల వార్షికోత్సవాలను కూడా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం



ధాన్యం తూకాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి

సబ్బవరం: ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి రైతులకు బాసటగా నిలవాలని వ్యవసాయ శాఖ సిబ్బందికి ఎంపీపీ బోకం సూర్యకుమారి సూచించారు.మండలంలోని గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను సోమవారం ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 15 నాటికి ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకూ మండలంలో 300 మెట్రిక్ టన్నుల వరకూ ధాన్యం కొనుగోలు చేసినట్టు వ్యవసాయ శాఖ సిబ్బంది తెలిపారు. మరో 320 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దేముడుబాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బోను గంగునాయుడు, మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, వీఏఏ హేమలత, ఏఈవో బాలరాజు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



విద్యార్థుల విన్యాసాలు

సింహాచలం: విద్యార్థులకు శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని నేవీ కమాండర్ కె.సుధీప్‌కుమార్ తెలిపారు. పెందుర్తి భాష్యం స్కూల్లో సోమవారం ఇంటర్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ప్రదర్శించిన విన్యాసాలు అబ్బురపరిచాయి. పాఠశాల జేఈవో వెంకట్, ప్రిన్సిపాల్, జి.వి.దీపిక పాల్గొన్నారు.

నారసింహుడికి వైభవంగా ఆర్జిత సేవలు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు, పాల్గొన్న భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఘనంగా గరుడసేవ : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం గరుడసేవ ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై అధిష్టంపజేశారు. అష్టోత్తరశతనామావళి పూజ అనంతరం భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. విశేషంగా హారతులు అందజేశారు. అర్చకుడు చిన్నా తదితరులు ఈ పూజ నిర్వహించారు.

టీడీపీ నేతవి తప్పుడు ఆరోపణలు

- ఆ కుటుంబానికి రైతు భరోసా ద్వారా లబ్ధి
- వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామారావు



కూండ్రపు అమ్మాజీ పేరున ప్రభుత్వం మంజూరు చేసిన పత్రం

పరవాడ: నాయుడుపాలెం టీడీపీ నాయకుడు కూండ్రపు మధు తన కుటుంబానికి ప్రభుత్వం ఎలాంటి పథకాలు మంజూరు చేయలేదని చేసిన ఆరోపణలో వాస్తవం లేదని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కోన రామారావు పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు మంజూరు విషయంలో తప్పుడు ప్రచారం చేసుకోవాల్సిన అవసరం తమ ప్రభుత్వానికి లేదన్నారు. నాయుడుపాలేనికి చెందిన కూండ్రపు అమ్మాజీకి రైతు భరోసా ద్వారా మంజూరైన రూ.40,500 సొమ్మును ఆమె పేరున ప్రభుత్వం బ్యాంకులో జమ చేయడం జరిగిందన్నారు. కూండ్రపు అమ్మాజీ మరణించడం వల్ల అత్తా కోడళ్ల పేర్లు ఒకే కార్డులో మ్యాపింగ్ కావడంతో ఆమె కోడలు శ్యామల పేరున లబ్ధి చేకూరిన విషయాన్ని టీడీపీ నాయకుడు మధు గుర్తించాలని హితవు పలికారు. ఇప్పటికైనా తప్పుడు ప్రకటనలు మానుకోవాలని రామారావు సూచించారు.

పాలిటెక్నిక్ కళాశాల రోడ్డు విస్తరణకు సన్నాహాలు

- ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ఆదేశం



అధికారులతో కలిసి పర్యటిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి నుంచి పులగానిపాలెం వెళ్లే మార్గంలోని పాలిటెక్నిక్ కళాశాల రోడ్డు విస్తరణ పనులకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. పులగానిపాలెం మార్గంలో సోమవారం ఎమ్మెల్యే అధికారులతో కలిసి పర్యటించారు. పాలిటెక్నిక్ కళాశాల నుంచి ఉన్న మార్గం అస్తవ్యస్తంగా ఉండటంతో వెంటనే రోడ్డు విస్తరణ పనులకు అంచనాలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న టెంపుల్ ఇన్‌స్పెక్టర్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సోమవారం కె.కోటపాడు మండలం రొంగలి నాయుడుపాలేనికి చెందిన కొల్లి శివప్రసాద్ అనే దాత లక్షా 1,116రూపాయల విరాళం అందజేశారు. దేవస్థానం తరపున దాతకు బాండ్‌ను ఆలయ ఇన్‌స్పెక్టర్ కనకరాజు అందజేసి స్వామివారి దర్శనం కల్పించారు. ప్రసాదం అందజేశారు.

నమో శివరుద్రాయ



సింహాచలం: అడవివరం విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో సోమ వారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉమాదేవి అమ్మవారికి కుంకు మపూజలు నిర్వహించారు. శివ నామస్మరణ హోరెత్తింది. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.

పూజలందుకున్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి

హోంగార్డు నిజాయితీ

• నగదుతో దొరికిన పర్సు అప్పగింత



పోగొట్టుకున్న పర్స్ అందజేస్తున్న సీఐ రంగనాథం

సబ్బవరం: సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న హోం గార్డుకు నగదుతో పరసు దొరికింది. దాన్ని పోలీస్ స్టేషన్‌కు అప్పగించి తన నిజాయితీ చాటుకున్నాడు. వివరాలు.. కాళ్ల కోటేశ్వరరావు అనే హోం గార్డు సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఆయనకు నగదుతో ఉన్న పర్సు దొరకడంతో పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. పోలీసులు పర్స్‌ను పరిశీలించగా అందులో రూ.7,600 నగదుతో పాటు ఆధార్ కార్డు, సీ బుక్ ఉన్నాయి. వాటిలో ఉన్న అడ్రస్ ఆధారంగా విచారణ చేయడంతో పర్సు పోగొట్టుకున్న వ్యక్తి ఇరువాడకు చెందిన గొంతిన సత్తిబాబుగా గుర్తించారు. దీంతో సోమవారం పోలీస్ స్టేషన్‌లో సీఐ రంగనాథం హోం గార్డు చేతులమీదుగా సత్తిబాబుకు పర్స్ అందజేశారు. హోమ్ గార్డును అభినందించారు. నిబద్ధతతో విధులు నిర్వహించడంతో కోటేశ్వరరావు గతంలో అనేకసార్లు ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు పొందారని ఈ సందర్భంగా సీఐ రంగనాథం గుర్తు చేశారు.

సీఎం వైఎస్ జగన్ పాలన దేశానికే ఆదర్శం

• ఎమ్మెల్యే అదీప్‌రాజ్



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: ముఖ్యమంత్రి వై ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. నాయుడుపాలెం గ్రామంలో సోమవారం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య ఘనస్వాగతం పలికారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే నాయుడుపాలెం, మెట్టపాలెం, పాతరాజానపాలెం గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. సంక్షేమ పథకాలు వివరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కారణంగా తాము గ్రామాల్లో దర్జాగా తిరగ గలుతున్నామన్నారు. సంక్షేమ పథకాలు నేరుగా ఇళ్లకు తెచ్చి ఇస్తున్నారని మళ్లీ అటువంటి ప్రభుత్వమే కావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని చెప్పారు. గ్రామాల్లో చిన్న చిన్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు.అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలను అందిస్తున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలకు మేలు చేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించి వచ్చే ఎన్నికల్లో జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బూస అప్పలరాజు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, ఈవోఆర్డీ పద్మజ, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, నాయకులు బొడ్డపు చిన్నారావు, బండారు కృష్ణబాబు, యమహానాయుడు, బండారు శ్రీను, ఆర్.ముత్యాలు, బి. శ్రావణ్, కె.కృష్ణంనాయుడు, నానాజీ, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి విపత్తుల సమయంలో తక్షణ స్పందన



హాజరైన ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు, వలంటీర్లు



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో శ్రీరామమూర్తి

జెడ్పీ సీఈవో శ్రీరామమూర్తి

సింహాచలం: ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు తక్షణమే స్పందించాలని ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు, ఎన్‌ఎస్‌ఎస్, వలంటీర్లకు జిల్లా పరిషత్ సీఈవో పి.శ్రీరామమూర్తి సూచించారు. పెందుర్తి టీటీడీసీలో సోమవారం ఆపదమిత్ర శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈనెల 17వతేదీ వరకు నిర్వహించనున్న కార్యక్రమాన్ని సీవో శ్రీరామమూర్తి ప్రారంభించారు. ప్రకృతి విపత్తులు జరిగినప్పుడు తక్షణమే స్పందించాలని, సాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కృష్ణమోహన్, పెందుర్తి ఎంపీడీవో కె.వెంకటరావు, టీవోటీ కె.కరుణాకర్, రిసోర్స్ పర్సన్లు మహేష్, టి.సుధాకర్, ఎన్‌డీఆర్‌ఎఫ్ హెడ్‌కానిస్టేబుళ్లు ఢిల్లేశ్వరరావు, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలో కొనసాగించాలి

- ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకుల డిమాండ్



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

కూర్మన్నపాలెం: కార్మికుల కష్టానికి కేంద్ర ప్రభుత్వం విలువనిచ్చి, విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేలా పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలి వద్ద సీవో, సీపీపీ, వీయూపీపీసీ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 725వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ప్రజారచయిత్రుల వేదిక జాతీయ అధ్యక్షురాలు మల్లేశ్వరి, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కాత్యాయినీ విద్మహే, ప్రముఖ వకీల్ జవహారా, శాంతి ప్రబోధ అరుణజ్యోతి, తిరునగరి దేవకి పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకుడు జె.అయోధ్యరామ్, మల్లేశ్వరి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మాలని ప్రకటించడం కార్మికుల జీవితాలతో ఆడుకోవడమే అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికులు, మేధావులు, విద్యార్థులు, కళాకారులు, రచయితలు పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేస్తున్నారన్నారు. ఉక్కు ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలచి మరింత ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కె.బాబూరావు, తాండ్ర కనకరాజు, ఎస్.జ్యోతిప్రసాద్, శివ రామకృష్ణ, ఎం.శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ నాయ కులు కొమ్ము ప్రసాద్, సుబ్బారావు, సీఐటీయూ నాయకులు కె.ఆనంద్‌కుమార్, కొల్లి నాగేశ్వరరావు, పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

తెలుగు సినీ ఉత్సవం ప్రారంభం

సీతంపేట: తెలుగు సినిమా ఉత్సవం ఘనంగా ప్రారంభమైంది. తెలుగు తొలి టాకీ సినిమా భక్తప్రహ్లాద 1932 ఫిబ్రవరి 6న విడుదలై 91 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వైజాగ్ ఫిల్మ్ సొసైటీ మూడు రోజుల పాటు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తోంది. ద్వారకా నగర్ పౌర గ్రంథాలయంలో సోమవారం సాయంత్రం సినీ దర్శకుడు వి.ఎన్.ఆదిత్య జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ముందుగా సినీ దిగ్గజాలు కె.విశ్వనాథ్, జమున చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదిత్య మాట్లాడుతూ మానవ విలువలను స్పృశించే సినిమాలను ప్రజలకు చేరువ కావాలని ఫిల్మ్ సొసైటీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విశాఖలో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని, సినీ ప్రేక్షకులు ఒక కమిటీగా ఏర్పడి పాలకులపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. తాను ఇక్కడే చదివానని, విశాఖపై పూర్తి అవగాహన ఉందని, అందుకే తన చిత్రాలు ఎక్కువగా ఇక్కడే షూటింగ్ చేశానని, భవిష్యత్‌లో కూడా కొనసాగిస్తానని తెలిపారు. అనంతరం కళాతపస్వి కె.విశ్వనాథ్ దర్శకత్వంలో జమున నటించిన ఉండమ్మా బొట్టు పెడతా చిత్రాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు, భరణికాన రామారావు, ఆచార్య ఎన్.ఎ.డి.పాల్, కాశీవిశ్వేశ్వరరావు, సుసర్ల శ్రీనివాస్, బి.చిన్నారావు పాల్గొన్నారు.